క్లుప్తంగా

సాగరతీరం శుభ్రత



చెత్తను సేకరిస్తున్న నేవీ సిబ్బంది

బీచ్‌రోడ్డు: పునీత్ సాగర్ అభియన్ పేరుతో తూర్పు నావికాదళం సిబ్బంది శనివారం నగరంలోని పలు సాగరతీరాలను శుభ్రం చేశారు. యండాడ, ఆర్కేబీచ్, జాలరిపేట, కోళింగ బీచ్, వుడా పార్క్, బీచ్‌లలో వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో 650 మంది సిబ్బంది పాల్గొనగా.. 750 కేజీల చెత్తను సేకరించారు.

అబ్బురపరిచిన అన్నమయ్య పదనర్తన



చిన్నారులు నృత్య ప్రదర్శన

మద్దిలపాలెం : విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అకాడమి అసోసియేషన్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని అన్నమయ్య విగ్రహం వద్ద శనివారం అన్నమయ్య పదనర్తన ఘనంగా నిర్వహించారు. అన్నమాచార్య 315వ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రముఖ నాట్య గురువుల శిష్యుల బృందం అద్భుతంగా నృత్య ప్రదర్శన చేసింది. ఈ కార్యక్రమంలో కూచిపూడి నాట్య గురువు, జాతీయ ఆర్ట్స్ డైరెక్టర్ బత్తుల సుదర్శనరావు, ప్రముఖ ఆంధ్రా నాట్య గురువు నాటరాజ్ పరమేశ్వర్ ముఖ్య అతిథులుగా పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి కన్నం వెంకట రమణ, కుమారి మంజూష, సింధుజ, గురు గోపినాథ్, చైతన్య ప్రభు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు పట్టం

- ఘనంగా 'జగనన్న ఆణిముత్యాలు'

ఏయూక్యాంపస్ : భవిష్యత్ తరాలకు మనం అందించే నిజమైన సంపద విద్య అని రాష్ట్ర ముఖ్యమంత్రి విశ్వసిస్తున్నారని స్థానిక 20వ వార్డు కార్పొరేటర్ ముప్పల లక్ష్మి అన్నారు. శనివారం ఉదయం ఈస్ట్‌పాయింట్ కాలనీలోని కేడీపీఎం పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు పురస్కారాల ప్రధాన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు జి.హేమంత్ కుమార్, పి.శ్రీ మహాలక్ష్మి తులసి, ఏ.శంకర్‌లకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను సైతం కార్పొరేట్ తరహాలో అభివృద్ధి చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. నాడు-నేడు పథకం ఏర్పాటు చేసి పాఠశాలల రూపురేఖలు మార్చేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల బోధన జరుపుతూ విశ్వవిపణికి అనుగుణంగా మన విద్యార్థులను సన్నద్ధం చేయడం జరుగుతోందన్నారు. పేదలపై భారం పడకుండా దుస్తులు, పుస్తకాలు, షూ, బ్యాగ్ వంటివి జగనన్న విద్య కానుక రూపంలో నాణ్యమైన వస్తువులను ప్రతీ విద్యార్థికి అందించడం ఎంతో గర్వకారణమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న డిజిటల్ బోధన వసతులను సద్వినియోగం చేసుకుంటూ ప్రతీ విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో ఎదగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.



విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్న కార్పొరేటర్ ముప్పల లక్ష్మి

పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుమతీభాయి మాట్లాడుతూ నిబద్ధత కలిగిన బోధన సిబ్బందితో ప్రభుత్వం అందించిన పటిష్ట ప్రణాళికను అమలు చేస్తూ అత్యుత్తమ ఫలితాలను సాధించడం వీలయిందన్నారు. మెరుగైన ఫలితాలను సాధించడంతో పాటు అత్యుత్తమ మార్కులను విద్యార్థులు సాధించారన్నారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం పోషకాల నిండుగా, విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందన్నారు. ఇటీవల ప్రారంభించిన రాగిజావ కార్యక్రమం కూడా ఎంతో విజయవంతం అయిందని, విద్యార్థులు ఎంతో ఇష్టంగా వీటిని తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ముప్పల సురేష్, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదింటి చిన్నారులు ప్రతిభా ప్రపూర్ణులు

రాష్ట్ర ప్రభుత్వం చిన్నారులను ప్రోత్సహించే విధంగా ప్రవేశ పెట్టిన జగనన్న ఆణిముత్యాలు పురస్కారాలు పేదింటి చిన్నారులు అందుకున్నారు. కార్పెంటర్, తాపీమేస్త్రి, టైలర్ వంటి చిన్న వృత్తుల చేసేవారి చిన్నారులు ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ప్రతిభ చూపారు. ఐదు వందలకు పైగా మార్కులు తమ ప్రతిభతో సాధించిన అబ్బురపరచారు. వీరికి ప్రభుత్వం అందించిన ప్రశంసాపత్రం, పురస్కారాలు వారి భవిష్యత్ జీవితానికి నూతన శక్తి నందిస్తాయి.

ఇంజినీరింగ్ చదవాలనేది ఆకాంక్ష



ఇంజినీరింగ్ విద్యను అభ్యసించాలని కోరుకుంటున్నా. పదో తరగతిలో 527 మార్కులను సాధించా. ఇంటర్ ఎంపీసీ గ్రూప్‌లో చేరా. ఎంసెట్ రాసి మంచి ర్యాంక్ సాధించడం నా లక్ష్యం. అందుకు కష్టపడి చదువుతా. నాన్న తాపీ మేస్త్రిగా పనిచేస్తున్నారు. ఉన్నతంగా స్థిరపడాలని కోరుకుంటున్నాను.

–జి.హేమంత్ కుమార్, విద్యార్థి

పాలిటెక్నిక్‌లో చేరుతున్నా..



పాఠశాల అధ్యాపకుల సహకారం, బోధన విధానంతో పదో తరగతితో 525 మార్కులు సాధించా. తండ్రి కార్పెంటర్‌గా పనిచేస్తున్నారు. ఉన్నతంగా చదివి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడాలనేది నా ఆకాంక్ష. ప్రస్తుతం పాలిటెక్నిక్‌లో చేరుతున్నాను. అధ్యాపకులు చెప్పిన పాఠాలు నిత్యం రివిజన్ చేయడం, ముఖ్యమైన ప్రశ్నలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో మెరుగైన ఫలితాలు సాధించాను.

–పి. శ్రీ మహాలక్ష్మి తులసి, విద్యార్థిని

పాఠశాల్లో బోధన బాగుంది



పాఠశాలలో మంచి అధ్యాపకులు, బోధన అందిస్తున్నారు. నిత్యం చదివించడం, ఉదయం 5 గంటలకు నిద్ర లేపి అధ్యాపకులు చదవమని ప్రోత్సహించేవారు. నాన్నది టైలరింగ్ వృత్తి. తల్లి దండ్రుల ఆకాంక్షలను నిజం చేసే విధంగా ఉన్నతంగా చదివి స్థిరపడాలని ఆశిస్తున్నాను. ఈ పురస్కారం మరింత ప్రోత్సాహం ఇస్తుంది.

–ఏ.శంకర్, విద్యార్థి

ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత లక్ష్యంగా..



పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులు సైతం ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రత్యేక ప్రణాళికతో పనిచేశాం. ప్రాథమిక అంశాల నుంచి పరీక్ష ఉత్తీర్ణత సాధించే వరకు అవగాహన తర్ఫీదు ఇచ్చాం. లీడ్ ప్రోగ్రాం వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపే విధంగా ఏర్పాటు చేశారు. దీంతో పాఠశాలలో ఉత్తీర్ణత పెరగడంతో పాటు, మెరుగైన ఫలితాలు సాధించడానికి వీలయింది.

–వి.మధుస్మిత, ఆంగ్ల ఉపాధ్యాయిని

అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన



రెయిన్ పార్కు అభివృద్ధికి శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకట కుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల



శివాజీపార్కులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని 17, 19 వార్డుల పరిధిలో పలు అభివృద్ధి పనులకు మేయర్ గొలగాని హరివెంకట కుమారి శంకుస్థాపన చేశారు. ఆయా ప్రాంతాల్లో వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మలతో కలిసి శనివారం ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 19వ వార్డు పరిధిలోని రెయిన్‌బో పార్కులో రూ.95 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వాకింగ్ ట్రాక్, వాల్స్ నిర్మాణం, ఇలా పలు రకాల సౌకర్యాలను ఇక్కడ అభివృద్ధి చేయనున్నారు. దీంతో పాటు 17వ వార్డు పరిధిలోని శివాజీపార్కులో రూ.1.53 కోట్లతో అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. పార్కుల్లో శిథిలావస్థలో ఉన్న పలు నిర్మాణాలకు, సందర్శకుల సౌకర్యాలను ఇక్కడ అభివృద్ధి చేయనున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచడానికి ఆయా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అక్కరమాని విజయనిర్మలతో పాటు 17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య, 20వ వార్డు కార్పొరేటర్ ముప్పల లక్ష్మి, 19వ వార్డు వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ సూరాడ వెంకటలక్ష్మి, జెడ్సీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాలువలు శిథిలం



ఇసుకతోట జంక్షన్ వద్ద పై కప్పులేని కాలువ



పూడికలతో నిండిపోయిన కాలువ

మద్దిలపాలెం : కాలువలు ప్రమాదకరంగా మారాయి. నిత్యం జనసంచారం ఉండే ప్రధాన ప్రాంతాల్లో కాలువలు సక్రమంగా లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కాలువల్లో పూడికలు తొలగించే నేపథ్యంలో కొన్నింటిని జీవీఎంసీ సిబ్బంది తొలగిస్తే..మరికొన్ని చోట్ల కాలువలు శిథిలావస్థకు చేరాయి. కాలువల్లో వ్యర్థాలు తొలగించకపోవడం..పైకప్పులు లేకపోవడంతో దుర్వాసనతో పలు ప్రాంతాల ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం అయ్యే సరికి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. జీవీఎంసీ 16వవార్డు పరిధిలో గల ఇసుకతోట జంక్షన్ వద్ద రోడ్డు పక్కగా ఉన్న కాలువలపై పైకప్పులు లేవు. ఈ కాలువలకు అనుకుని దుకాణ సముదాయాలున్నాయి. ఆ దుకాణాలకు వెళ్లి వినియోగదారులు ప్రమాదవశాత్తు పడిపోతున్నారు. రాత్రి వేళల్లో కూడా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలకు మరమ్మతులు చేయాలని ఇసుకతోటకు చెందిన ఎన్వీ సింహాచలంతో పాటు పలువురు కోరారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న రోహిణీ రామన్

బీచ్‌రోడ్డు:జీవీఎంసీ 12వ వార్డులోని ఆరిలోవ పోలీసు స్టేషన్ వెనుక ప్రాంగణంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను శనివారం వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణీరామన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిపక్ష నేతలు ఎన్ని కుట్రలు పన్నినా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పేదలకు సొంతంటి కల నెరవేరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సత్తిమందారెడ్డి, పి.బాలరాజు, సూర్యారావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు



సర్టిఫికెట్లు అందజేస్తున్న కార్పొరేటర్ సునీత

బీచ్‌రోడ్డు: పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన శ్రీకృష్ణాపురం గురుకుల పాఠశాల విద్యార్థులకు 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత శనివారం జగనన్న ఆణిముత్యాలు పేరిట ప్రోత్సాహకాలను అందజేశారు. విద్యార్థులు దేముడు బాబుకు (516) రూ.3వేలు, తరుణ్ శ్రీదేవ్‌కు (498) రూ.2 వేలు, ప్రసాద్‌కు(488) రూ. వెయ్యి చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. నాడు నేడు పథకం కింద పాఠశాలల అభివృద్ధి, సౌకర్యాలు కల్పించడం, జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ వంటి ఎన్నో విప్లవాత్మకమైన పథకాలను అమలు చేసిన ఘనత సీఎంకు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బీకే రమేష్, ఉపాధ్యాయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా...



ఏయూ క్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం పోలమాంబ మైదానంలో నిర్వహిస్తున్న ఫుడ్ ఫెస్టివల్ ఆటో ఎక్స్‌పో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సినీ గీతాలకు డ్యాన్స్ చేసి ఉత్సాహ పరిచారు. వేదిక చుట్టూ ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్‌లో ఆహార పదార్థాలను నగరవాసులు రుచి చూశారు. సందర్శకులకు లక్కీ డ్రా నిర్వహించి వెండి కాయిన్ బహూకరించారు.

సీఎం జగన్‌కే యువత మద్దతు

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగ కమిటీల్లో నియామకాలు



మాట్లాడుతున్న ఆళ్ల శివగణేష్

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో సుస్థిర పాలన అందిస్తున్న, వేలాది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే యువతంతా మద్దతు పలకాలని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివ గణేష్ పిలుపునిచ్చారు. రైల్వే న్యూకాలనీలోని పార్టీ యువజన విభాగం కార్యాలయంలో శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు ఆధ్వర్యంలో యువజన విభాగ రాష్ట్ర, జిల్లా, మండల, వార్డు, స్థాయి కమిటీల నియామకాల ప్రక్రియ మొదలైందన్నారు. జిల్లాలోని ఉత్సాహవంతమైన యువకులు, జగనన్న అభిమానులు, పార్టీ యువజన విభాగ కార్యకర్తలంతా ముందుకు రావాలన్నారు. 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌నే గెలిపించే బాధ్యతను అందరూ తమ భుజస్కందాలపై వేసుకోవాలని కోరారు. నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, పార్టీ సమన్వయకర్తల ద్వారా మద్దిలపాలెంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని ఆళ్ల శివగణేష్ విజ్ఞప్తి చేశారు. యువజన విభాగం నాయకుడు జీలకర్ర నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన కాన్టెక్ ఎక్స్‌పో -2023



మాజీ చైర్మన్ కుమార్ రాజాను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఎంవీపీకాలనీ: బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాన్టెక్ ఎక్స్‌పో 2023 శనివారం కూడా కొనసాగింది. బీచ్ రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్ వేదికగా ఈ ఎక్స్‌పో ద్వారా ప్రదర్శిస్తున్న నిర్మాణ రంగ ఉత్పత్తులను తిలకించేందుకు సందర్శకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. డీజీఎన్‌పీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ బ్రిగేడియర్ ఎస్.రామనాథన్, కోస్ట్‌గార్డ్ చీఫ్ ఇంజినీర్ ఎంఎల్ వర్మ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్టాల్స్‌ను తిలకించారు. అనంతరం వారిని నిర్వాహకులు సత్కరించారు. ప్రదర్శనలో భాగంగా యూనియన్ బ్యాంకు, మహామాయ సిమెంట్, సాగర్ సిమెంట్, వరుణ్ జేసీబీ స్టాల్స్‌ను వ్యాపారులు పెద్ద ఎత్తున సందర్శించారు. ఈ ఎక్స్‌పో ద్వారా 60 స్టాల్స్‌ను ప్రదర్శించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ ప్రదర్శనలు కొనసాగాయి. కార్యక్రమంలో బీఏఐ విశాఖ చాప్టర్ చైర్మన్ వెంకటేశ్వర్లు, అఖిల భారత సభ్యుడు రామకోటయ్య, మాజీ చైర్మన్ కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సీతమ్మధార: డిగ్రీ కళాశాలలకు ఆన్‌లైన్ అడ్మిషన్ ప్రక్రియ తొలగించి, నేరుగా అడ్మిషన్లు చేసుకునే విధంగా ప్రభుత్వం అవకాశం ఇవ్వాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కనుమర్ల గుండారెడ్డి అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అద్దె భవనాల్లో నడుపుతున్న డిగ్రీ కళాశాలలకు 33 ఏళ్ల లీజు అవకాశం కల్పించాలని, మూడేళ్ల అఫిలియేషన్ అందించాలన్నారు. రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీల్లో ఒకే రకమైన అఫిలియేషన్ ఫీజులు, రిజిస్ట్రేషన్ ఫీజులు ఉండేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఆదివారం జరిగే ఆత్మీయ సమావేశంలో పలు సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. గౌరవాధ్యక్షులు చింత విజయ్ భాస్కర్‌రెడ్డి, టి.బాలరామకృష్ణ, జనరల్ సెక్రటరీ జెగ్రిపోతు రమణాజి, ఫైనాన్స్ సెక్రటరీ గుర్రాల వెంకటరెడ్డి, ఏయూ వైస్ ప్రెసిడెంట్ చల్లా రామకృష్ణప్రసాద్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ జాయింట్ సెక్రటరీ పొన్నాన జయరాం పాల్గొన్నారు.

'పితృదేవోభవ' వేడుకలు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ప్రపంచ పితృదినోత్సవాన్ని పురస్కరించుకుని హిందీ విభాగం ఆధ్వర్యంలో 'పితృదేవోభవ' వేడుకలు ఘనంగా నిర్వహించారు. తండ్రి గొప్పదనంపై వక్తలు మాట్లాడారు.

నాలుగేళ్ల డిగ్రీపై అవగాహన

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యాపరిషత్ కళాశాల ఆధ్వర్యంలో నాలుగేళ్ల డిగ్రీ కోర్సుపై శనివారం అవగాహన కల్పించారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020లో భాగంగా నాలుగేళ్ల డిగ్రీ కోర్సును అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ సూచనల మేరకు న్యూ ఎడ్యుకేషన్ పాలసీకి అనుగుణంగా సిలబస్‌లో సైతం మార్పులు చేస్తున్నట్లు కళాశాల యాజమాన్యం వెల్లడించింది. ఇందులో భాగంగా విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ లబ్ధిదారులకు శిక్షణ

మహారాణిపేట : ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు లబ్ధిదారుల నుంచి చక్కటి స్పందన కనిపించింది. ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) స్కీమ్ కోసం గత వారం జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథం ఇచ్చిన ప్రకటనకు స్పందిస్తూ 19 మంది ముందుకు వచ్చారు. వీరికి శనివారం తాటిచెట్లపాలెం ఏపీఎఫ్‌పీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. లబ్ధిదారులకు జోనల్ మేనేజర్ సాయి శ్రీనివాస్ పలు అంశాల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి కె.మన్మథరావు, డీఆర్పీ ప్రతాప్‌కుమార్, ఎస్.వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై కమిషనర్‌కు వినతి

డాబాగార్డెన్స్: ప్రజల సమస్యలపై తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్లు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మకు వినతిపత్రం అందజేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి కష్టాలు, విద్యుత్ దీపాల నిర్వహణ సరిగ్గా లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారంటూ ఆ పార్టీ జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు నేతృత్వంలో పలువురు కార్పొరేటర్లు కమిషనర్‌ను కలిసారు. బోర్లు లేక మంచినీటి ఎద్దడి ఎక్కువగా ఉందని వినతిపత్రంలో తెలిపారు. గంధం శ్రీనివాసరావు, పిల్లి మంగమ్మ, గొలగాని వీరారావు, శరగడం రాజశేఖర్, గల్లా చిన్న, పల్లా శ్రీనివాసరావు, పులి లక్ష్మీబాయి, దాడి రమేష్, పీవీ నరసింహం, బొమ్మిడి రమణ తదితరులు కమిషనర్‌ను కలిశారు.

డిగ్రీ, పీజీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో 2023-24 నూతన విద్యా సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్ అడ్మిషన్లు ఈ నెల 19 నుంచి జరుగునని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు WWW.OAMDC. AP.GOV.IN పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7780168423, నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.